క్లుప్తంగా

యాంత్రీకరణ సాగు లాభదాయకం



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పొందూరు: కూలీల కొరత, అధిక కూలీ రేట్లతో సాగు భారమవుతున్న ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో యాంత్రీకరణ మేలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. లైదాం గ్రామంలో శనివారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో రైతు మిత్రలకు వరిసాగులో యాంత్రీకరణపై శిక్షణ నిర్వహించారు. వరిలో దోమపోటు, పాడ తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ అనూష రైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, సర్పంచ్ అనంత రామకృష్ణ, పొందూరు–జి.సిగడాం మండలాల రైతుమిత్రలు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ అందుకుంటున్న సింహాచలం

సరుబుజ్జిలి: మండలంలోని చిగురువలస గ్రామానికి చెందిన రావాడ సింహాచలంకు పవర్ సిస్టమ్ ద్వారా సమీకృత విధానం మెరుగుపరుచుకోవడం అన్న అంశంలో పీహెచ్‌డీ పట్టా పొందినట్లు తల్లి రావాడ హైమావతి శనివారం తెలిపారు. శుక్రవారం అమరావతిలో జరిగిన విట్–ఏపీ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవం సందర్భంగా ఏపీ గవర్నర్ అబ్దుల్‌నజీర్, వైస్ చాన్సలర్ వి.కోటారెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నర్సారావుపేట ఏఎంరెడ్డి మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

108లో ప్రసవం



శిశువును చూపిస్తున్న 108 సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని సంతోషపురం గ్రామానికి చెందిన సవర యశోధ శనివారం 108లోనే ప్రసవించింది. పురిటినొప్పులు రావడంతో 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. గర్భిణిని పలాస ఆస్పత్రికి తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో నొప్పులు పెరగడంతో ముక్తాపురం సమీపంలో సిబ్బంది వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. వైద్యుడు కుమార్ రాజా సలహా తీసుకుని సుఖప్రసవం చేశారు. యశోధ మగ శిశువుకు జన్మనిచ్చింది. వెంటనే కరజాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. 108 పైలట్ శ్రీనివాసరావు, ఈఎంటీ సత్యం, సిబ్బంది ప్రభావతి, ఆశ కార్యకర్త ఉన్నారు.

సృజనాత్మకతతోనే ఆవిష్కరణలు



ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న విద్యార్థులు

పాతపట్నం: నూతన ఆవిష్కరణలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని హెచ్‌ఎం బి.ప్రభాకరరావు అన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్చుతాపురంలో ఉన్న రవీంద్ర భారతీ పాఠశాలలో శనివారం ఫొటో గ్యాలరీని విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు తమ కెమెరాల్లో బంధించిన ఫొటోలను గ్యాలరీలో ప్రదర్శించామని హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీస్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మాదకద్రవ్యాల నియంత్రణ, వాటి వల్ల కలిగే అనర్థాలపై, మత్తు పదార్థాల విముక్తిపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనూరాధ మాట్లాడుతూ చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థినులు మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ప్రోత్సాహకం



సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ ఏడాది పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వాన విమలకుమారి, రట్టు యోగేంద్రరావు, జనా మహేశ్‌కు రూ.5 వేల చొప్పున పూర్వ విద్యార్థులు రామ్‌గోపాల్ వర్మ, లఖినేని శ్రీనివాసరావు అందించారు. గతంలో వీరు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించే సమయంలో ఇచ్చిన హామీ మేరకు నగదు ప్రోత్సాహకంతోపాటు ప్రశంసాపత్రం అందించారు. ప్రతి ఏటా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సత్యారావు, పూర్వ విద్యార్థులు బేబీరావు, శ్రీనివాసరావు, చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

– సారవకోట

● రక్షిద్దాం.. చదివిద్దాం..



ఆడ పిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం అని వన్ స్టాప్ కేస్ కార్యకర్త బి.కవిత అన్నారు. జలుమూరు కేజీబీవీలో విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. స్వీయ రక్షణకు విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలను వివరించారు. నిరాశ్రులైన వారికి సంస్థ నుంచి అందించే సహకారం, ప్రధానంగా బాలికలు, విద్యార్థినులు, మహిళలకు ఎటువంటి నష్టం, కష్టం కలిగినా ఫోన్ 100, 1098181, 112 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. కేజీబీవీ ఎస్‌ఓ ఎ.యశోధ, అధ్యాపకులు వాన సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– జలుమూరు

● జల కళ



జలుమూరు మండల పరిధిలోని కరవంజ–గుగ్గిలి గ్రామాల మధ్య ఉన్న కృష్ణసాగరం కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ఎగువ ప్రాంతం వంశధార కాలువ నుంచి నీటితో నిండింది. సుమారు 200 ఎకరాల విస్తీరణం గల ఈ సాగరం అటు జలుమూరుతోపాటు నరసన్నపేట మండలాల్లోని 3ఆర్ మేజర్ నడగాం కాలువ ద్వార నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ప్రస్తుతం నిండుకుండులా ఉండడంతో దిగువ ప్రాంతానికి సాగునీరు ప్రవహిస్తోంది. మత్స్యకారులు చేపలు పట్టి ఉపాధి పొందుతున్నారు.

– జలుమూరు

రైతన్న దరిచేరని.. వ్యవసాయ పథకాలు

- విత్తనాలు, ఎరువులకు తప్పని పాట్లు
- ప్రభుత్వ రాయితీపై అందని స్ప్రేయర్లు
- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే దిక్కు
- ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి కోసం అన్నదాతకు తిప్పలు



ఆశాజనకంగా ఉన్న వరిపంట

ఎల్.ఎన్.పేట: రైతన్నలకు ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం అందలేదు. మరోవైపు రాయితీపై ఇచ్చే వ్యవసాయ పనిముట్లు రైతుల దరిచేరటం లేదు. ఖరీఫ్ సీజన్‌లో కలుపు నివారణ మందు, పంటను ఆశించే పురుగుల మందులు పిచికారీ చేసేందుకు కనీసం స్ప్రేయర్లు కూడా ప్రభుత్వం రాయితీపై ఇవ్వటం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విత్తనాల కోసం, కొన్ని రోజుల క్రితం ఎరువుల కోసం అనేక ఇబ్బందులు పడిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకునే దాఖలాలు లేవు.

టార్పాలిన్లు, స్ప్రేయర్లు..

ప్రతీ ఏడాది వ్యవసాయ శాఖ ద్వారా బీసీ రైతులకు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీపై టారాయన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్లు రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఈ ఏడాది ఇప్పటివరకు రైతులకు ఉపయోగపడే ఎలాంటి పనిముట్లు విక్రయించలేదు. పంట సాగు సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం రైతు బాధలను పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు.

అన్నదాత సుఖీభవ ఏదీ..

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలను ఊరించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఎడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు అన్ని సందర్భాల్లోనూ ఊదరగొట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పెట్టుబడి కోసం రైతులు అప్పలు చేస్తున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి సాయం చేయలేదని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందటం లేదని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలే గానీ.. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లేవంటున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలోని సాగు భూమి (ఎకరాల్లో), రైతుల వివరాలు ఇలా..

మండలం	సాగు భూమి	రైతులు
ఎల్.ఎన్.పేట	10,850	6,560
మెళియాపుట్టి	23,500	12,285
పాతపట్నం	18,500	8,895
కొత్తూరు	21,900	11,280
హిరమండలం	6,650	4,200

అధిక ధరలకు కొనుగోలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, టార్పాయన్లు, అయిల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతులకు ప్రతీ ఏడాది పంట కాలంలో ఎంతగానో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా కనీసం 50 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేయాలి.

– పల్లి శంకర్, రైతు, వాడవలస, ఎల్.ఎన్.పేట

అనుమతి రావాల్సి ఉంది



రైతులకు రాయితీపై ఇచ్చే పరికరాల కోసం ప్రభుత్వ నుంచి అనుమతి రావాల్సి ఉంది. ప్రస్తుతం రాయితీతో కూడిన ఎలాంటి పథకాలు ఇవ్వటం లేదు. విత్తనాలు, ఎరువులు రాయితీపై విక్రయించారు. మరికొద్దీ రోజుల్లో పెసర, మినుము విత్తనాలు రాయితీపై విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

కృష్ణదాస్‌కు అభినందనలు



సారవకోట: కృష్ణదాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సారవకోట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ధర్మాన కృష్ణదాస్‌ను శనివారం ఆయన నివాసంలో మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిశారు. మరలా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుతం మండలంలో ఉన్న పరిణామాల గూర్చి తెలియజేశారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, బాబూరావు, గోవిందరావు, షణ్ముఖరావు, పార్టీ నాయకులు పల్లి కృష్ణారావు, భాస్కరరావు, గెల్లంకి వెంకటరావు, జాడ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

కృష్ణదాస్‌ను కలిసిన బూర్లె



కొత్తూరు: కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి నియామకమైన మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు శనివారం కలిసి ముబగాం వెళ్లి కలిసి సత్కరించారు. మండలంలో పార్టీ పరిస్థితిని కృష్ణదాస్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని శ్రీనివాసరావుకు కృష్ణదాస్ సూచించారు.

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు మోసం

- నయవంచనతో కూడిన వందరోజుల పరిపాలన
- విద్య వ్యవస్థను భ్రష్టు పట్టించిన కూటమి సర్కార్
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్



మాట్లాడుతున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలన నయవంచన, మోసమేనని, పేదవారి నోట్లో మట్టి కొట్టేలా సాగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఆరోపించారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నూతన మద్యం పాలసీ నిరుపేద కుటుంబాల పాలిట గుదిబండగా మారనుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు కూడా.. హామీలు వరకే పరిమితమై.. ఉత్తుత్తి గ్యాస్ గానే మిగలనుందన్నారు. 50 ఏళ్లు దాటిన బీసీలకు వృద్ధాప్య పింఛన్‌పై ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. యువతకు నిరుద్యోగ భృతి కల్పన పేరుతో మోసం చేశారన్నారు. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతన్నల ఆక్రందనలు వినబడవా అని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ పేరుతో 30 వేల పోస్టులంటూ కేవలం 16,700 పోస్టులకే నోటిఫై చేశారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కూడా మహిళలకు ఊరడింపు చర్య అని అన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ఏక కాలంలో ప్రారంభించేలా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చొరవ చూపారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో కళాశాలలను మంజూరు చేయించుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. మెడికల్ సీట్లు కోత పెట్టేలా చంద్రబాబు వ్యవహరించడం తగదన్నారు. క్లస్టర్ స్కూల్ మ్యాపింగ్ ద్వారా రాష్ట్రంలో వందలాది పాఠశాలలను మూసివేసేందుకు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రస్తుత ఏడాదిలో పదో తరగతి విద్యార్థులు సీబీఎస్సీ సిలబస్‌లో పరీక్ష రాస్తారో, లేదో తెలియని సందిగ్ధంలో ఉన్నారన్నారు. విద్యా శాఖలో యాప్‌ల సంఖ్యను పెంచి, ఉపాధ్యాయులపై మరింత భారం మోపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకుడు పొన్నాడ చిన్నారావు పాల్గొన్నారు.

భూ సర్వే అక్రమాలపై ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామ రెవెన్యూలో భూములు రీ సర్వేలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు నిర్వహించిన బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. అన్ని హక్కులు ఉన్న వారిని కాదని సంబంధం లేని వ్యక్తుల పేరున రీ సర్వేలో భూమలను నమోదు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ హక్కులు లేని రైతులు పేరున పంట నమోదు చేసిన రెవెన్యూ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. కర్లెమ్మ గ్రామ రెవెన్యూకు రిగ్యులర్ సర్వేయర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఒకే ఎల్‌పీఎంలో ఇద్దరు రైతుల పేర్లు జాయింట్‌గా నమోదు చేయడం వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నామన్నారు.

అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీటీ సత్యనారాయణకు అందజేశారు. రైతులు జి.కృష్ణారావు, పి.యతిరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

నరసన్నపేట: ఏపీటీఎఫ్ (1938) 80 వసంతాల వేడుక, 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలు విజయనగరంలో అక్టోబరు 6, 7, 8వ తేదీల్లో నిర్వహిస్తున్నామని, వీటిని విజయవంతం చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఈ మహా సభలకు సంబంధించిన గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిలా అధ్యక్షుడు టెంక చలపతిరావు మాట్లాడుతూ విజయనగరంలో ఎంతో ప్రతిష్ఠగా తీసుకుని చేస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు వస్తారన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో ప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ నరసన్నపేట శాఖ ప్రధాన కార్యదర్శి బి.కేశవరావు, జిల్లా కౌన్సిలర్ జోగారావు, ప్రతినిధులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉన్నత పాఠశాలతో పాటు మాకివలస, మడపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు.

మండల స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ



పాతపట్నం: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: విద్యార్థులతో ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీల్లో కాగితాపల్లి హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచారు. వాలీబాల్, ఖోఖో కబడ్డీలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్‌ఎం తవిటి నాయుడు, యెగా టీచర్ తాడేల సాయి కృష్ణ, ఉపాధ్యాయులు నారాయణరావు, కొవిలాపు రాజారావు తదితరులు శనివారం అభినందించారు.

విద్యార్థులకు అభినందన..

పాతపట్నం: మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20న జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్–17 బాలుర విభాగంలో ఖోఖో, టెన్నిస్ కాయిట్‌లో మొదటి స్థానం, అండర్–14లో టెన్నిస్ కాయిట్ మొదటి స్థానంలో, కబడ్డీ రెండో స్థానం, బాలికల విభాగంలో అండర్–14 టెన్నిస్ కాయిట్ మొదటి స్థానంలో గెలుపొందారని హెచ్‌ఎం వల్లభరావు అన్నారు. శనివారం పాఠశాల వద్ద విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాసుల ఆహ్వానం

పాతపట్నం: మండలానికి మొదటి విడతలో మంజూరైన 35 గోకుల షెడ్ల యూనిట్లకు దరఖాస్తులు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు శనివారం తెలిపారు. దరఖాస్తు సంబంధిత గ్రామ సచివాలయంలోని వెటర్నీ అసిస్టెంట్‌కు అందజేయాలన్నారు.

దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, స్థలానికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్ అందజేయాలన్నారు. గ్రామ సభ తీర్మానం, వాంగ్మూలం, యానిమల్ పొజిషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

ఆర్థికసాయం

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన బొమ్మాన మోహన్‌రావు ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు అందజేసిన కొంత మొత్తాన్ని మృతుడు భార్య పద్మకు శనివారం కొత్తూరు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ తాతబాబు అందజేశారు. ఎల్.శంకరరావు, జి.బాబూరావు, ఎల్.ఈశ్వరరావు, వై.నారాయణరావు, కె.సంజీవరావు, ధర్మారావు ఉన్నారు.

గణపతి లడ్డూ రూ.41 వేలు

పొందూరు: స్థానిక కస్పావీధి–2లో శుక్రవారం రాత్రి వినాయక లడ్డూ వేలం పాటలో మార్కెట్‌కు చెందిన వ్యాపారి యుప్పిడి సంతోష్‌కుమార్ రూ.41,600 చెల్లించి సొంతం చేసుకున్నారు. గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా



రహదారి గుంతలో బోల్తాపడిన ఆటో

సరుబుజ్జిలి: మండల కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. అలికాం–బత్తిలి రహదారిలో ఏర్పడిన గుంతల్లో వర్షనీరు చేరింది. సరుబుజ్జిలి పెట్రోల్ బంకు వద్ద ఉన్న గుంతలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

సరుబుజ్జిలి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని జిల్లా సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు అన్నారు. రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్లస్‌టూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

గొప్ప సంఘ సంస్కర్త గురజాడ

స్త్రీ అభ్యున్నతికి గురజాడ అప్పారావు ఎంతో కృషి చేశారని, సంఘ సంస్కర్తగా మంచి గుర్తింపు పొందారని పలువురు వక్తలు అన్నారు. శనివారం గురజాడ జయంతి సందర్భంగా నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజవకర్గాల్లోని పభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గురజాడ చిత్ర పటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. కన్యాశుల్కం నాటకం, దిద్దుబాటు, లంగరు ఎత్తు, లంగరు దించు వంటి గురజాడ రచనలు సమాజాభ్యునతికి ఎంతో దోహదపడ్డాయన్నారు.

సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న తెలుగు అధ్యాపకులు రవికుమార్



బూర్జ: కొల్లివలస బీఆర్ అంబేద్కర్ గురుకులంలో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ దేవేంద్రరావు, అధ్యాపకులు



హిరమండలం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఆమదాలవలస: ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్. స్వామి

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం



నిమజ్జనానికి విశ్వకర్మ ప్రతిమను సిద్ధం చేస్తున్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: మండల కేంద్రంలో ఆది విరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాలు చివరి దశకు వచ్చాయి. స్వర్ణకారులు చేపట్టిన జయంతి ఉత్సవాలు శనివారం ముగిశాయి. విశ్వకర్మ ప్రతిమను శనివారం గంగమ్మ ఒడికి తీసుకువెళ్లారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. స్వర్ణకారులు నిర్వహించిన నిమజ్జనంలో పట్టణానికి చెందిన స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.